సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



జాతీయ పతాకంతో కార్తీక శరణ్య

స్కేటింగ్‌లో కార్తీక శరణ్య సత్తా

ఎంవీపీకాలనీ/తగరపువలస: తైవాన్ వేదికగా జరిగిన అంతర్జాతీయ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భీమిలి మండలం మూలకుద్దుకు చెందిన బొల్లెంకుల కార్తీక శరణ్య సత్తాచాటింది. గత నెల 25 నుంచి 30 మధ్య తైవాన్‌లో ఈ పోటీలు జరగ్గా.. రెండు విభాగాల్లో రజత పతకాలు సాధించింది. ఆమె ఎంవీపీకాలనీలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో 8వ తరగతి చదువుతోంది. విశాఖ జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. కొన్నేళ్లుగా స్కేటింగ్ అసోసియేషన్ కోచ్ సత్యనారాయణ వద్ద శరణ్య శిక్షణ పొందుతోంది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు రత్నకుమారి, అప్పన్న రెడ్డి, కోచ్ చిట్టిబాబు, స్కూల్ యాజమాన్యంతో పాటు స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ఆమెకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.





ఈద్ ముబారక్

జిల్లాలో రంజాన్ వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. చెంగల్రావుపేటలోని అతి పురాతన జామియా మసీదు, కోటవీధి దర్గా, అంబుసరంగు వీధిలోని మసీదు, భూపేష్‌నగర్‌లోని కేరళ మసీదు, జెండాచెట్టు వద్ద గల మసీదు, జగదాంబ జంక్షన్‌లోని మక్కా మసీదుల్లో సందడి నెలకొంది. ఈ సందర్భంగా రంగురంగుల దుస్తులు ధరించిన ముస్లిం చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

న్యూస్‌రీల్

ప్రతి రోజూ సూపర్ స్పెషాలిటీ సేవలు

కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్



మహారాణిపేట: కేజీహెచ్‌లో మంగళవారం నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో కూడా ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయని సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. అన్ని సూపర్ స్పెషాలిటీ అవుట్ పేషంట్ (ఓపీ) విభాగాలు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తాయన్నారు. గతంలో సూపర్‌స్పెషాలిటీ ఓపీలు వారానికి మూడు రోజులు పనిచేసేవి. ఇప్పుడు సోమవారం నుంచి శనివారం వరకు అన్ని రోజుల్లో ఓపీలు పనిచేస్తాయని వెల్లడించారు. రోగులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న నలుగురి అరెస్టు

డాబాగార్డెన్స్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న నలుగుర్ని విశాఖ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. సీపీ శంఖబ్రత ఆదేశాలమేరకు సైబర్ క్రైం పోలీసులు విశాఖ కేంద్రంగా జరుగుతున్న బెట్టింగ్ యాప్‌లపై నిఘా పెట్టారు. ఈక్రమంలో బెట్టింగ్ వెబ్‌సైట్‌లో డబ్బు పెట్టేలా అలవాటు చేయిస్తున్న నగరానికి చెందిన జి.ప్రవీణ్‌కుమార్, మదీనావల్లీ, రజియా బేగం, ధరణిని సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. బెట్టింగ్ వెబ్‌సైట్ల రూపకర్తలు దుబాయ్ చెందిన జియా, సౌరభ్‌గా గుర్తించామని పోలీసులు తెలిపారు. విశాఖలో బెట్టింగ్ వెబ్‌సైట్లు ప్రమోట్ చేస్తున్న టెలికాలర్లను విడిచిపెట్టేది లేదని పోలీసులు స్పష్టం చేశారు. నిందితులను జిల్లా మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్ విధించారు. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ www. cybercrime. gov. ఇన్‌లేదా టోల్ ఫ్రీ నంబరు 1930, లేదా కమిషనర్ ఆఫ్ పోలీస్ 7995095799కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

మీ జీతం.. మీ చేతుల్లోనే..

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి హితబోధ

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లోకి తీసుకురావాల్సిన బాధ్యత ఉద్యోగులదేనని, తద్వారా మీ జీతాలు మీరే సమకూర్చుకోవాలని కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ అన్నారు. సోమవారం ఆయన స్టీల్‌ప్లాంట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లోని వివిధ స్థాయి అధికారులు, కార్మికులతో సమావేశమై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్–3ను మొదట్లో జూన్‌లో ప్రారంభించాలని అనుకున్నప్పటికీ, ప్రస్తుతం అది మేలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే సింటర్ ప్లాంట్‌ను ఆధునికీకరించడం ద్వారా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచనున్నట్లు వెల్లడించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సెయిల్ కంటే మెరుగ్గా ఉందని పేర్కొంటూనే.. సెయిల్‌తో కాకుండా జిందాల్, టాటా స్టీల్ వంటి సంస్థలతో పోటీ పడి ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ రంగంలో కొందరు పని చేస్తుంటే.. మరికొందరు పనిని తప్పించుకునే ప్రయత్నం చేస్తుంటారని, అలాంటి వారిని కూడా ఉత్పత్తి ప్రక్రియలో భాగస్వాములను చేయడంలో మానవ వనరుల విభాగం కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆయన వెంట స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులు ఉన్నారు.

నాలుగో లైన్‌కి మోక్షం

- కొత్తవలస–విజయనగరం మధ్య కొత్త రైల్వే లైన్
- రూ.239.91 కోట్లతో టెండర్లు ఆహ్వానించిన ఈస్ట్ కోస్ట్ రైల్వే
- రెండేళ్లలో పూర్తి చేసేలా నిబంధనలు
- లైన్ పూర్తయితే సరకు రవాణా మరింత వేగవంతం



సాక్షి, విశాఖపట్నం: ఐదేళ్ల క్రితం నాటి ప్రతిపాదనలు ఎట్టకేలకు పట్టాలెక్కుతున్నాయి. తూర్పు కోస్తా రైల్వే ప్రాజెక్టులపై సీతకన్ను వేసిన రైల్వే బోర్డు.. జోన్‌కు శంకుస్థాపన చేసిన తర్వాత కీలక ప్రాజెక్టులపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా సరకు రవాణాతో పాటు.. రైల్వే ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేలా కొత్తవలస–విజయనగరం నాలుగో రైల్వే లైన్‌కు మోక్షం కలిసింది. ఈ లైన్ నిర్మాణానికి రూ.239 కోట్లతో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ టెండర్లు ఆహ్వానించింది. టెండర్లు ఖరారు చేసిన తర్వాత... రెండేళ్లలో పనులు పూర్తి కానున్నాయి.

వాల్తేరు పరిధిలో ఉన్న కొత్తవలస, విజయనగరం మధ్య నాలుగో రైల్వే లైన్‌ని నిర్మించాలని అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపించారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ని కూడా సిద్ధం చేసి నాలుగేళ్ల క్రితం పంపించగా.. దానికి ఆమోదముద్రవేశారు. కాని.. ప్రాజెక్టు నిర్మాణానికి ప్రాథమికంగా నిధులు మంజూరుకు పరిపాలన పరమైన అనుమతులు కూడా మంజూరయ్యాయి. కానీ.. టెండర్లు పిలవడంలో మాత్రం ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అయితే విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించి.. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేసిన తర్వాత.. ఒక్కో ప్రాజెక్టుపై రైల్వే బోర్డు అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే కొత్తవలస–విజయనగరం మధ్య నాలుగో రైల్వే లైన్‌కు తాజాగా టెండర్లు ఆహ్వానించారు.

రూ.239 కోట్లతో నిర్మాణానికి..

కొత్తవలస విజయనగరం మధ్య రైల్వేలైన్‌లు కీలకంగా మారాయి. విశాఖపై వచ్చే రద్దీని నియంత్రించేందుకు కొత్తవలస జంక్షన్ ప్రధాన భూమిక పోషిస్తోంది. ఇందుకనుగుణంగా.. విజయనగరం, కొత్త వలస జంక్షన్ మధ్య ఫోర్త్‌లైన్ అవశ్యమని గుర్తించారు. టూ పాకెట్ సిస్టమ్‌తో టెండర్లు ఆహ్వానించారు. దాదాపు 35 కిలోమీటర్ల మేర ఈ లైన్ రాబోతోంది. మొత్తం రూ.239.91 కోట్లతో టెండర్లు పిలిచారు. ఏప్రిల్ 25 వ తేదీ వరకూ టెండర్లు వేసేందుకు గడువు విధించారు. మొత్తం 4 షెడ్యూల్స్‌లో పనులు నిర్వహించనున్నారు. వర్క్ ఆర్డర్ ఖరారు చేసిన తర్వాత... 24 నెలల్లో పనులు పూర్తి చెయ్యాలని నిబంధన విధించారు.

ఈ లైన్ పూర్తి చేస్తే వైజాగ్‌రైల్వే స్టేషన్‌కు రైళ్ల రద్దీ నిర్వహణ సులభతరమవుతుంది. అదేవిధంగా.. వైజాగ్ పోర్టుతో పాటు స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రధాన పరిశ్రమలకు సరకు రవాణా మరింత సులభతరమవుతుంది. పాసింజర్ రైళ్లపై ప్రభావం పడకుండా.. గూడ్స్ రైళ్లకు మార్గం సుగమమవుతుందని వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు చెబుతున్నారు.

ఇంటర్ చదువులకు వేళాయె

- నేటి నుంచి సెకెండ్ ఇయర్ విద్యార్థులకు తరగతులు
- ఈ నెల 23 వరకు పనిచేయనున్న జూనియర్ కాలేజీలు
- ఫస్టియర్ అడ్మిషన్లకు గ్రీన్ సిగ్నల్



విశాఖ విద్య: జిల్లాలోని జూనియర్ కళాశాలలు మంగళవారం నుంచి తెరుచుకోనున్నాయి. ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు తరగతుల బోధనకు అంతా సిద్ధమైంది. ఇటీవలనే పరీక్షలు రాసి, వేసవి సెలవుల మూడ్‌లోకి వెళ్లిన విద్యార్థులంతా కళాశాలలకు తిరిగి రావాల్సిందే. కూటమి ప్రభుత్వం ఇంటర్ విద్యలో సంస్కరణ పేరిట తీసుకొచ్చిన విధానంతో 2025–26 విద్యా సంవత్సరం మంగళవారం నుంచే మొదలుకానుంది. ఈనెల 23 వరకు తరగతులు నిర్వహించారు. 24 నుంచి జూన్ 1 వరకు వేసవి సెలవులు ఇవ్వనున్నారు. అనంతరం జూన్ 2 నుంచి కళాశాలలు పనిచేయనున్నాయి.

జిల్లాలో కళాశాలలు ఇలా..

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 211 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో గతేడాది వరకు 188 కళాశాలల్లో అడ్మిషన్లు జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు –10 , ఎయిడెడ్ కళాశాల–1, ఏపీ సాంఘిక సంక్షేమ–3, ఏపీ గిరిజన సంక్షేమ–1, కేజీబీవీలు–3, బీసీ సంక్షేమ–1, హైస్కూల్ ప్లస్ –9, ప్రైవేటు కళాశాలలు 183 ఉన్నాయి. 2024–25 విద్యా సంవత్సరంలో జిల్లాలో 42,257 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు నమోదు చేసుకున్నారు. వీరందరికీ మంగళవారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

ఇతర జిల్లాల నుంచి విద్యార్థుల రాక

జిల్లాలో పదో తరగతి ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు రెట్టింపు స్థాయిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఇక్కడ ప్రవేశాలు జరుగుతాయి. ప్రతీ ఏటా పదో తరగతి సుమారుగా 28 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుంటారు. వీరిలో 80 శాతం మేర ఉత్తీర్ణులౌతారు. అయితే 2024–25లో ఇంటర్ మొదటి సంవత్సరంలో సుమారు 40 వేల మంది విద్యార్థులు చేరారు. విశాఖలో ఉన్న సౌలభ్యం, పోటీ పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ ఇచ్చే కళాశాలలు అందుబాటులో ఉండటంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పలువురు విద్యార్థులు నగరంలోని జూనియర్ కళాశాలల్లో చేరుతున్నారు. ఈ నేపథ్యంలోనే అడ్మిషన్ల సంఖ్య ఏటేటా పెరుగుతోంది.

ప్రైవేటుకు పగ్గాలు

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ఈ నెల 7 నుంచి చేసుకోవచ్చని ప్రభుత్వం విడుదల చేసిన విద్యా క్యాలెండర్‌లో స్పష్టం చేసింది. మే 31 వరకు అడ్మిషన్ల ప్రక్రియను కొనసాగించవచ్చని పేర్కొన్నారు. ఇదే క్రమంలో ఈ నెల 7 నుంచి మొదటి సంవత్సరం తరగతులు సైతం ప్రారంభానికి అనుమతినివ్వటంతో జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలకు పగ్గాలు వచ్చినట్టైంది. ఇప్పటికే అడ్మిషన్ల వేట మొదలుపెట్టిన ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలకు ప్రభుత్వం ఆదేశాలు మరింత జోష్ నింపాయి. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులను తమ కళాశాలల్లో చేర్చుకునేలా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు గణనీయంగా తగ్గిపోయే ప్రమాదముందని విద్యావేత్తలు అంటున్నారు.

అడ్మిషన్ల పెంపునకు కృషి



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లు పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రభుత్వం ప్రకటించిన అకడమిక్ క్యాలెండర్ పక్కాగా అమలుచేస్తాం. ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లు పెంచాలనే ఉద్దేశ్యంతోనే ఇంటర్ విద్యలో సంస్కరణలను ప్రభుత్వం తీసుకొచ్చింది. లక్ష్య సాధన దిశగా జిల్లాలోని అన్ని కాలేజీల ప్రిన్సిపాల్స్ బాధ్యత తీసుకోవాలి.

– బి.రాధ, డీవీఈవో

నిబంధనలు పాటించాలి



ప్రభుత్వ ఆదేశాల మేరకు, ఇంటర్మీడియట్ బోర్డు జారీ చేసిన నిబంధనలను కాలేజీ నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలి. ఇందుకు వ్యతిరేకంగా వ్యవహరించే కాలేజీల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. స్పాట్ వాల్యూయేషన్ పక్రియను మరో రెండు మూడు రోజుల్లోనే పూర్తి చేస్తాం. కాలేజీల నిర్వహణపై దృష్టి సారిస్తాం.

– పి. మురళీధర్, ఆర్ఐవో

పన్ను వసూలు @ 510 కోట్లు

- లక్ష్యానికి మించి వసూలు
- జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరేందిర ప్రసాద్



డాబాగార్డెన్స్: రాష్ట్రంలోనే అతిపెద్ద కార్పొరేషన్ అయిన జీవీఎంసీ పరిధిలో 6 లక్షలకు పైగా ఆస్తి/ఖాళీ స్థల అసెస్‌మెంట్లు ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరం (2024–25)లో సుమారు రూ.510 కోట్లు (రాత్రి 9 గంటల సమయానికి) ఆస్తి పన్ను వసూలైంది. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నుపై 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటించడంతో ప్రజలు, వివిధ సంస్థలు భారీ స్థాయిలో తమ ఆస్తి పన్నులు చెల్లించారు. జీవీఎంసీ గత ఆర్థిక సంవత్సరం (2023–24)లో రూ.454 కోట్లు వసూలు చేసింది. గతేడాదితో పోలిస్తే జీవీఎంసీ పరిధిలో రూ.56 కోట్లు అదనంగా వసూలైంది. అదనపు కమిషనర్ (రెవెన్యూ), డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ), జోనల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సిబ్బంది నిరంతరం కృషి ఫలితంగా సోమవారం రాత్రి 9 గంటల వరకు రూ.510 కోట్లు (రూ.510,31,90,354) వసూలైందని, రాత్రి 12 గంటల వరకు అన్ని సౌకర్య కేంద్రాలు పనిచేస్తున్నందున ఈ వసూలు ఇంకా పెరిగే అవకాశం ఉందని కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ హరేందిర ప్రసాద్ తెలిపారు.

విదేశీ రాయబారి రాక



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న అమెరికా అంబాసిడర్

గోపాలపట్నం: నగరంలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు అమెరికా అంబాసిడర్ జోర్గాన్ కె. ఆండ్రూస్ సోమవారం విశాఖ చేరుకున్నారు. ఆయన విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన బస చేసేందుకు ఓ హోటల్‌కు వెళ్లారు.

అలా భోగాపురానికి..

- భోగాపురం విమానాశ్రయం కనెక్టివిటీకి 15 రహదారుల అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.392 కోట్లతో రోడ్ల నిర్మాణాలకు ప్రణాళికలు
- వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యం
- నిర్మాణాలకు సిద్ధమవుతున్న ఆర్అండ్‌బీ, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ

నాటి అడుగులే.. నేడు రహదారులు..



విశాఖ సిటీ : వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో చేసిన ప్రణాళికలే నేడు బాటలుగా మారుతున్నాయి. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు కనెక్టివిటీకి 15 కొత్త రహదారుల నిర్మాణాలకు అడుగులు పడుతున్నాయి. విశాఖ నుంచి అంతర్జాతీయ విమానాశ్రయానికి సునాయాసంగా, వేగంగా రాకపోకలు సాగించేందుకు కొత్త రోడ్లు సిద్ధం కానున్నాయి. ఇందుకోసం వీఎంఆర్‌డీఏ అంచనాలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. వచ్చే నెలలో టెండర్లు పిలిచి మే నుంచి రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి వీటిని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రూ.392 కోట్ల అంచనా వ్యయంతో 82.08 కిలోమీటర్ల మేరకు విస్తరణ, కొత్త రోడ్లను అభివృద్ధి చేయనున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రణాళికలు


విశాఖ నుంచి భోగాపురం విమానాశ్రయానికి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు జాతీయ రహదారికి అనుసంధానంగా 15 ప్రత్యామ్నాయ రోడ్లను అభివృద్ధి చేయాలని గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. వీటిని మాస్టర్ ప్లాన్‌లో కూడా చేర్చింది. వీటిలో ఇప్పటికే ఒక రోడ్డు పూర్తి కాగా.. మిగిలిన 14 రహదారుల నిర్మాణానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వీటి నిర్మాణాలను వీఎంఆర్‌డీఏతో పాటు జీవీఎంసీ, ఆర్అండ్‌బీ శాఖలు చేపట్టనున్నాయి. అయితే అత్యధికంగా 8 రహదారుల నిర్మాణ బాధ్యతను వీఎంఆర్‌డీఏ తీసుకుంటోంది. ఆర్అండ్‌బీ 3, జీవీఎంసీ 2 రోడ్లను నిర్మించనున్నాయి. మిగిలిన నాలుగు రహదారులను కూడా జీవీఎంసీ, ఆర్అండ్‌బీలతో కలిపి వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేయనుంది.

రహదారి	నిర్మాణ శాఖ	కి.మీ.
అయినాడ జంక్షన్–ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్	ఆర్అండ్‌బీ	6.5
దాకమర్రి–రావాడ	వీఎంఆర్‌డీఏ	6.66
చిప్పాడ–పోలిపల్లి(దివీస్‌రోడ్డు)	వీఎంఆర్‌డీఏ	6.32
తగరపువలస–మూలకుద్దు	జీవీఎంసీ	3.6
నేరేళ్లవలస–తాళ్లవలస	వీఎంఆర్‌డీఏ	4
దొరతోట జంక్షన్–కుమ్మరిపాలెం	ఆర్అండ్‌బీ	6.2
బోయపాలెం–మంగమారిపేట	వీఎంఆర్‌డీఏ	6
గంభీరం–గంభీరం ఎన్‌హెచ్16	వీఎంఆర్‌డీఏ	2.2
పరదేశిపాలెం–గంభీరం	వీఎంఆర్‌డీఏ	1.4
మారికవలస–తిమ్మాపురం	జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ	6.3
శివశక్తినగర్–హరిత ప్రాజెక్ట్స్	జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ	1.7
అడవివరం–గండిగుండం	ఆర్అండ్‌బీ, వీఎంఆర్‌డీఏ	8
గండిగుండం–చింతలపాలెం	వీఎంఆర్‌డీఏ	9.9
వేపగుంట–జుత్తాడ	జీవీఎంసీ	6.05
పినగాడి–వేపగుంట	ఆర్ అండ్ బి	7.25

8 విస్తరణ.. 15 కొత్త రోడ్లు

ఈ 15 రహదారులలో 8 రోడ్లను విస్తరించనున్నారు. మిగిలిన ఏడు రోడ్లను కొత్తగా అభివృద్ధి చేయనున్నారు. విజయనగరం జిల్లా అయినాడ జంక్షన్ నుంచి రింగ్‌రోడ్–ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ మధ్య 9 మీటర్ల రోడ్డు ఉండగా.. దాన్ని 24 మీటర్లకు విస్తరించనున్నారు. తగరపువలస (చిట్టివలస రోడ్డు) నుంచి మూలకుద్దు మధ్య ఉన్న రోడ్డును 45 మీటర్లకు, దొరతోట రోడ్డు జంక్షన్ నుంచి కుమ్మరిపాలెం మధ్య 60 మీటర్లకు, బోయపాలెం జంక్షన్ నుంచి మంగమారిపేట జంక్షన్, శివశక్తి నగర్ నుంచి హరిత ప్రాజెక్ట్స్, అడవివరం నుంచి గండిగుండం, పినగాడి నుంచి వేపగుంట రోడ్లను విస్తరించనున్నారు. అలాగే దాకమర్రి–రావాడ, చిప్పాడ–పోలిపల్లి (దివీస్ రోడ్డు), నేరెళ్లవలస–తాళ్లవలస, గంభీరం–గంభీరం హైవే, పరదేశిపాలెం–గంభీరం, వేపగుంట–జుత్తాడల మధ్య కొత్త రహదారులను అభివృద్ధి చేయనున్నారు.

వచ్చే ఏడాది జూన్‌కు పూర్తి



భోగాపురం విమానాశ్రయం పనులు పూర్తయ్యేలోగా ఈ రహదారులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విశాఖ నుంచి ఎయిర్‌పోర్టుకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా సునాయాశంగా రాకపోకలు సాగించడానికి అనువుగా ప్రత్యామ్నాయ రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. ఇందుకు సంబంధించి వచ్చే నెలలోనే టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి మేలో నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది జూన్ నాటికి ఈ రోడ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించాం.

– కె.ఎస్.విశ్వనాథన్, మెట్రోపాలిటన్ కమిషనర్

దారి చూపిన దేవతా ఈ చేయి ఎన్నడూ వీడకా..!



దారి చూపిన దేవతా ఈ చేయి ఎన్నడు వీడకా..జన్మ జన్మకు తోడుగా నా దానివై నువ్వు నడిచిరా..గీతరచయిత మైలవరపు గోపి రచించిన గొప్ప పాట ఇది. వీరిని చూస్తే ఈ పాట గుర్తుకువస్తుంది. భార్యభర్తల అన్యోన్యదాంపత్యానికి నిదర్శనం వీరిద్దరు. ఒకరికొకరై జీవిస్తున్నారు. భర్తకు కళ్లు కనిపించపోయినా ఆమె చేయి పట్టుకుని నడిపిస్తోంది. భార్యగా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తోంది. ఓ ముస్లిం పెద్దాయనకు కళ్లు కనిపించవు. రంజాన్ సందర్భంగా ఈద్గాకు వెళ్లి నమాజ్ చేయాలని భార్యను కోరాడు. కోటవీధి ఫెర్రీరోడ్డులో గల ఈద్గా ప్రాంతానికి తన భర్తను తీసుకెళ్లి నమాజ్ చేసుకునేలా సహకరించింది. నమాజ్ అనంతరం భర్తను ఇంటికి తీసుకువెళ్లింది.

– ఫొటో : డాబాగార్డెన్స్/ సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా

నేడు పింఛన్ల పంపిణీ

మహారాణిపేట: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 1,59,903 మంది ఫించనుదారులు ఉండగా, ప్రభుత్వం రూ.69.80 కోట్లను విడుదల చేసింది. మంగళవారం పింఛన్‌దారులందరూ సచివాలయ సిబ్బందికి అందుబాటులో ఉండాలని అధికారులు సూచించారు.

6న సీతారాముల కల్యాణం

మహారాణిపేట: పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డులోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 6న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 6న ఉదయం 10.12 గంటలకు స్వామి కల్యాణం జరుగుతుంది. రూ.300 చెల్లించిన వారికి కల్యాణ లడ్డూ, పులిహోర, తలంబ్రాలు అందజేస్తామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం తెలిపారు. రూ.300 చెల్లించిన వారి పేర్లు, గోత్రనామాలను కల్యాణ మహోత్సవంలో చదువుతామని పేర్కొన్నారు.

ఖైదీల సౌకర్యాలపై ఆరా



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

ఆరిలోవ: కేంద్ర కారాగారాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ సోమవారం సందర్శించారు. జైలు అధికారులతో కలిసి లోపల ఖైదీల బ్యారక్‌లు, పరిసరాలు, పరిశుభ్రత తదితరాలను పరిశీలించారు. జైలు ఆస్పత్రి, జ్ఞాన సాగర్ గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఖైదీల సంఖ్య, వారికి అందుతున్న సౌకర్యాలు, భోజనం, వైద్యం తదితరాల గురించి జైలు సూపరింటెండెంట్ ఎం.మహేష్ బాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వారు ఏయే నేరాలు, కేసులపై వచ్చారో అడిగి తెలుసుకున్నారు. మంచి ప్రవర్తన కలిగి ఉండాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు ఉప పర్యవేక్షణాధికారులు జవహర్‌బాబు, సాయి ప్రవీణ్, జైలర్లు, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీనివాసరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ ప్రజాదర్బార్

మహారాణిపేట: రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం నగరంలో పర్యటించారు. ఇందులో భాగంగా టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం వరుణ్ గ్రూప్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో నిర్మించనున్న తాజ్ వరుణ్ బే సాండ్స్ హోటల్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈద్ ముబారక్



మహిళా డిగ్రీ కళాశాల ఎదురుగా సర్వీస్ రోడ్డులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటున్న చిన్నారులు



ప్రార్థన చేస్తున్న బాలుడు

• ఘనంగా రంజాన్ వేడుకలు

డాబాగార్డెన్స్: జిల్లాలో రంజాన్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. చెంగల్రావుపేటలోని అతి పురాతన జామియా మసీదు, కోటవీధి దర్గా, అంబుసరంగు వీధిలోని మసీదు, భూపేష్‌నగర్‌లోని కేరళ మసీదు, జెండాచెట్టు వద్ద గల మసీదు, జగదాంబ జంక్షన్‌లోని మక్కా మసీదుల్లో సోమవారం సందడి నెలకొంది. ఈ సందర్భంగా ముస్లిం చిన్నారులు రంగురంగుల దుస్తులతో ప్రత్యేకంగా కనిపించి అందరినీ అలరించారు. పాతనగరంలోని పలువురు ముస్లింలకు వైఎస్సార్ సీపీ నాయకులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం రాత్రి నెలవంక దర్శనంతో ఉపవాసాలు ముగియడంతో ముస్లింలు మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలందరూ సంతోషంగా ఒకచోట చేరి ఈద్-ఉల్-ఫితర్‌ను జరుపుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.

➡ జగదాంబ జంక్షన్ సమీపంలోని మక్కా మసీదులో పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఖురాన్‌ను చదివి వినిపించగా, మత బోధకులు రంజాన్ పవిత్ర మాసంలో పొందే ప్రతిఫలాలను వివరించారు. సమాజ్‌కు ముందు పేదలు, అనాథలకు ఫిత్రా, జకాత్ దానాలు చేశారు.

➡ పాతనగరంలోని అంబుసరంగు ఈద్గా మైదానంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. అంబుసరంగు మసీదు అధ్యక్షుడు మహ్మద్ సుస్రత్ అలీఖాన్ నేతృత్వంలో ఇమామ్ హఫీజ్ మహ్మద్ ముతీయుర్ రెహ్మాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం ఖురాన్ పఠనం చేశారు.

➡ ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ఎదురుగా గల సర్వీస్ రోడ్డులో ప్రపంచ శాంతి, సౌభ్రాతృత్వం ఆకాంక్షిస్తూ ప్రార్థనలు జరిపారు. హాజీ ఖాసీం రజా మౌలానా, సొసైటీ అధ్యక్షుడు హైదర్ ఆలీ సింకా మాట్లాడుతూ సమస్త మానవాళికి ఖురాన్ మార్గదర్శిగా నిలుస్తోందన్నారు. కార్యదర్శి ఎండీ రహ్మతుల్లా, కోశాధికారి ఎస్.కె.అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

• రంజాన్ ప్రార్థనల్లో క్రికెటర్ షమీ



సాగర్‌నగర్ మసీద్‌లో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న క్రికెటర్ షమీ

కొమ్మాది : సాగర్‌నగర్ భువనేశ్వర్ కాలనీ మసీద్‌లో సోమవారం రంజాన్ ప్రార్థనల్లో భారత క్రికెటర్ మహ్మద్ షమీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులు పాటు కఠిన దీక్ష పూర్తి చేసుకుని రంజాన్ పండగ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. పవిత్రతకు, సహృద్భావానికి, ప్రేమ, సేవా భావానికి రంజాన్ పండగ ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనతో ఉండటం అనేది పవిత్ర రంజాన్ విశిష్టత అని పేర్కొన్నారు. అల్లా అనుగ్రహంతో దేశ ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లిం ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు అబ్దుల్ కుదుష్, అబ్దుల్లా పాల్గొన్నారు.

అప్పన్న చందనోత్సవం ఏర్పాట్లపై సమీక్ష



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఈవో సుబ్బారావు, సీఎఫ్‌వో భ్రమరాంబ

సింహాచలం: ఈ నెల 30న జరగనున్న సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి నిజరూప దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని దేవదాయశాఖ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ డి.భ్రమరాంబ అధికారులను ఆదేశించారు. చందనోత్సవం ఏర్పాట్లపై సోమవారం ఆమె ఈవో కె.సుబ్బారావు, ఇంజినీరింగ్ అధికారులు, విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. వీలైనంత వరకు ఎక్కువ మందికి దర్శనం కల్పించే లక్ష్యంతో అధికారులంతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా పరిశుభ్రత, క్యూల నిర్వహణ, క్యూల్లో భక్తులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ, షెల్టర్లు ఏర్పాటు, కొండపైన, కొండదిగువ తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లపై చర్చించారు. ఉత్సవ నిర్వహణ అంతా సీసీ కెమెరాల నీడలో జరగాలని, ప్రతీ క్యూ, మార్గం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో శీతల పానీయాలు అందించాలని సూచించారు. చందనోత్సవానికి వచ్చే ప్రతీ భక్తుడికి త్వరితగతిన దర్శనం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, శ్రీనివాసరావు, డీఈ హరి, సూపరింటెండెంట్‌లు నరసింగరావు, వెంకటరమణ, గాయత్రి, రాజ్యలక్ష్మి, ప్రసన్నలక్ష్మి, సత్యవాణి, శ్రీనివాస్, ఏఈలు తాతాజీ, బంగార్రాజు, రవిరాజు, బాబ్జీ పాల్గొన్నారు.

నర్సుల పోస్టులకు 'నకిలీ' పత్రాలు

• కరోనా సమయంలో పనిచేసినట్లు నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన అభ్యర్థులు
• అదనంగా 15 మార్కుల కోసం అడ్డదారులు
• ఉన్నతాధికారుల తనిఖీల్లో బండారం బట్టబయలు



ఆర్డీ కార్యాలయం

మహారాణిపేట: నర్సుల పోస్టుల భర్తీ ప్రక్రియలో నకిలీ సర్టిఫికెట్లు వెలుగులోకి వచ్చాయి. కొందరు నర్సింగ్ అభ్యర్థులు అదనంగా 15 మార్కులు పొందడానికి కరోనా సమయంలో పనిచేసినట్లుగా నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారు. అలాగే.. ప్రభుత్వ ఆసుపత్రులు లేదా కళాశాలల్లో పనిచేస్తున్న నర్సులు కూడా తిరిగి ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రాథమిక జాబితాపై వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం ఉన్నతాధికారుల తనిఖీల్లో ఈ విషయం బయటపడింది. దీంతో సంబంధిత అభ్యర్థుల దరఖాస్తులను అధికారులు పక్కన పెట్టారు. దీని కారణంగా మెరిట్ జాబితా విడుదల ఆలస్యమవుతోందని అధికారులు తెలిపారు.

ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మొదట 106 నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. తర్వాత మరో 264 పోస్టులు అదనంగా చేరడంతో మొత్తం 370 పోస్టుల భర్తీ చేపట్టారు. ఈ పోస్టుల కోసం గతంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 8,300 దరఖాస్తులు వచ్చాయి. జనవరి 27న ప్రాథమిక జాబితా విడుదల చేయగా, దానిపై 1,570 అభ్యంతరాలు వచ్చాయి. ఈ అభ్యంతరాలను పరిశీలించిన అధికారులు..నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన వారు, ఇప్పటికే ఉద్యోగం చేస్తున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకున్నట్లు గుర్తించారు. కరోనా సమయంలో పని చేసిన వారికి 15 అదనపు మార్కులు ఇస్తుండటంతో చాలా మంది నకిలీ సర్టిఫికెట్లు సమర్పించినట్లు తేలింది. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకురాలు రాధారాణి ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు.. వివిధ ప్రోగ్రామ్‌ల కింద పనిచేసిన వారి దరఖాస్తులను తిరస్కరించారు. సరైన వివరాలు సమర్పించని వారి దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకోవడం లేదు. కాగా.. మరో మూడు రోజుల్లో నర్సుల పోస్టులకు సంబంధించిన తుది జాబితాను విడుదల చేస్తామని డాక్టర్ రాధారాణి 'సాక్షి'కి తెలిపారు. ఈ జాబితాపై కూడా అభ్యంతరాలు స్వీకరించి, అనంతరం రోస్టర్ ప్రకారం ఎంపిక జాబితాను ప్రకటిస్తామని ఆమె వివరించారు.

పట్టువదలని అక్రమార్కుడు

• ప్రభుత్వ భూమి కబ్జాకు పదే పదే యత్నం
• తాజాగా స్థలం చదును చేస్తుండగా అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



పొక్లెయిన్‌తో స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం

కొమ్మాది: రూ.4 కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలంపై కన్నేసిన భూ కబ్జాదారుడు మరోసారి బరితెగించాడు. జీవీఎంసీ 4వ వార్డు పరిధి పరదేశిపాలెంలోని కాపులుప్పాడ రెవెన్యూ సర్వే నంబర్ 64లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. రంజాన్ సెలవును అదునుగా భావించి.. సోమవారం తెల్లవారుజామునే ప్రొక్లెయిన్‌ను ఉపయోగించి దాదాపు 60 సెంట్ల స్థలాన్ని చదును చేశాడు. తన వద్ద ఈ స్థలానికి సంబంధించిన పత్రాలు ఉన్నాయని.. నకిలీ పత్రాలు చూపిస్తూ నమ్మబలికే ప్రయత్నం చేశాడు. అయితే స్థానికులు వెంటనే స్పందించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పనులు నిలిపివేయాలని ఆదేశించారు. తొలుత పనులు నిలిపివేసినప్పటికీ.. మధ్యాహ్నం తిరిగి పది మంది కూలీలతో మళ్లీ పనులు ప్రారంభించాడు. దీంతో అధికారులు పొక్లెయిన్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించడంతో పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఇదే వ్యక్తి గతంలో కూడా ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించాడు. 2015లో అతని ప్రయత్నాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఆ తర్వాత 2021లో ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించగా, అప్పట్లో అధికారులు దానిని తొలగించారు. ఇప్పుడు మళ్లీ అదే స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడం గమనార్హం. దీంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం

పరదేశిపాలెంలో ఆక్రమణపై సమాచారం అందింది. తక్షణమే అధికారులు స్పందించి పనులు నిలిపివేశారు. ప్రభుత్వ స్థల పరిరక్షణలో భాగంగా తక్షణమే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం. ఈ స్థలాన్ని పదే పదే ఆక్రమిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటాం.

– సంగీత్ మాథూర్, ఆర్డీవో, భీమిలి

ఒక బైక్‌కు నిప్పు.. 17 వాహనాలు దగ్ధం

పగ తీర్చుకున్న ప్రేయసి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మణమూర్తి

అల్లిపురం: ప్రియుడు మోసగించాడని పగతో అతని బైక్‌ను తగలబెట్టగా, మంటలు పక్కనే ఉన్న ఇతర వాహనాలకు వ్యాపించడంతో మొత్తం 17 బైక్‌లు దగ్ధమయ్యాయి. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితురాలిని గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ లక్ష్మణమూర్తి తెలిపారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం జీవీఎంసీలో పనిచేస్తున్న భరత్.. సింగ్ హోటల్ జంక్షన్ సమీపంలోని ఓ గ్రూపు హౌస్‌లో నివాసం ఉంటున్నారు. గతంలో ఆయన నూడిల్స్ షాపు నడిపినప్పుడు బర్మా క్యాంపునకు చెందిన ఓ మహిళ అందులో పనిచేసేది. ఆ సమయంలో ఇద్దరు ప్రేమించుకున్నారు. అనంతరం మనస్పర్థలు రావడంతో ఏడాది కిందట ఇదే గ్రూపు హౌస్‌లో ఓ బైక్‌ను ఆమె తగలబెట్టిందని ఏసీపీ తెలిపారు. కాగా.. రెండు నెలల కిందట భరత్ హోండా షైన్ బైక్‌ను కొనుగోలు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న ఆమె గ్రూపు హౌస్ సెల్లార్‌లో నిలిపి ఉంచిన బైక్‌కు శనివారం తెల్లవారుజామున నిప్పు పెట్టింది. ఈ మంటలు పక్కనే ఉన్న ఇతర వాహనాలకు వ్యాపించడంతో మొత్తం 17 బైక్‌లు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.19 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని ఏసీపీ వివరించారు. నిందితురాలిని అరెస్టు చేసి ఈ నెల 11 వరకు రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో సీఐ ఎర్రంనాయుడు పాల్గొన్నారు. కేసును త్వరగా ఛేదించిన పోలీసులను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు.

180 కిలోల గంజాయి పట్టివేత

• ఐదుగురు నిందితుల అరెస్ట్, మినీ వ్యాన్, రెండు బైక్‌లు స్వాధీనం
• మరో కేసులో నాలుగున్నర కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్



పెందుర్తి మండలం రాజయ్యపేట వద్ద పట్టుబడిన 180 కిలోల గంజాయి

పెందుర్తి: ఒడిశా నుంచి నాసిక్‌కు తరలిస్తున్న గంజాయిని టాస్క్‌ఫోర్స్, పెందుర్తి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సీఐ కె.వి సతీష్‌కుమార్ తెలిపిన వివరాలివి. మినీ వ్యాన్‌లో 180 కిలోల గంజాయిని ఒడిశా నుంచి అరకు మీదుగా నగరం వైపు తరలిస్తున్న సమాచారం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు పెందుర్తి మండలం రాజయ్యపేట సమీపంలో కాపు కాశారు. మినీ వ్యాన్‌ను అడ్డుకుని అందులో పరిశీలించగా గంజాయి పట్టుబడింది. గంజాయిని స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మినీ వ్యాన్‌తో పాటు రెండు బైక్‌లు, రూ.10వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైల్వే స్టేషన్ వద్ద..

ఒడిశా రాష్ట్రం పడువా గ్రామం నుంచి నగరానికి గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు పెందుర్తి రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నారు. కేరళ కొట్టాయంకు చెందిన ఎస్.పి షరీఫ్ అలియాస్ అదుర్ ఒడిశా నుంచి నాలుగున్నర కిలోల గంజాయిని బ్యాగ్‌లో పట్టుకుని నగరానికి వస్తున్నాడు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న పోలీసులు రైల్వే స్టేషన్ వద్ద కాపు కాసి అతడ్ని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

ఆర్టీసీ కండక్టర్ అనుమానాస్పద మృతి



కండక్టర్ వెంకట రమణ (ఫైల్)

సబ్బవరం: టెక్కలిపాలెం గ్రామం సమీపంలోని రైవాడ కాలువలో వాల్తేరు డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ గిడితూరి వెంకటరమణ (54) ఆదివారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. కైలాసపురం కస్తూరినగర్‌లో నివాసం ఉంటున్న వెంకటరమణ స్వగ్రామం టెక్కలిపాలెం. అతని తండ్రి ముత్యాలు డీఎల్‌బీలో ఉద్యోగం చేయడంతో కైలాసపురంలో స్థిరపడ్డారు. అయితే స్వగ్రామం టెక్కలిపాలెంలో భూమి కొనాలని వెంకటరమణ భావించి, బంధువులతో మాట్లాడారు. ఈ మేరకు తన స్నేహితుడు వాసుపల్లి ఎల్లాజీతో కలిసి ఆదివారం ఉదయం రూ.20 వేలు తీసుకుని టెక్కలిపాలెం వచ్చారు. భూమి కొనుగోలు విషయంలో ఇరువర్గాల మధ్య బేరం కుదరకపోవడంతో మధ్యాహ్నం అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయారు. అయితే సాయంత్రం 6 గంటల సమయంలో వెంకటరమణ రైవాడ కాలువలో స్నానానికి వెళ్లి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. పోలీసులకు కూడా సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి పెద్ద కుమారుడు లీలా వంశీనాథ్ సోమవారం ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అతని స్నేహితుడు ఎల్లాజీని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వెంకటరమణకు భార్య సరోజినీ దేవి, కుమారులు లీలా వంశీనాథ్, నీరజ్ ఉన్నారు.

ఏఎంసీ ఎన్నికల్లో కల్యాణరావు ప్యానల్ విజయం




ఎన్నికల అధికారి నుంచి గెలుపు ధ్రువీకరణపత్రం అందుకుంటున్న బొడ్డు కల్యాణరావ

సీతంపేట: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ(ఏఎంసీ) ఎన్నికల్లో బొడ్డు కల్యాణరావు ప్యానల్ ఘన విజయం సాధించింది. రెండేళ్ల కాలపరిమితికి ప్యానల్ పద్ధతిలో జరిగిన ఎన్నికల్లో మూడు ప్యానల్స్ పోటీ పడ్డాయి. సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్, అనంతరం కౌంటింగ్ నిర్వహించారు. పూర్వ కో–ఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్ పి.రామారావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. 2324 మంది సొసైటీ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకోగా, బొడ్డు కల్యాణరావు ప్యానల్‌కి 1148, కొత్తపల్లి వెంకటరమణ ప్యానల్‌కు 843, రవి సిద్ధార్థ ప్యానల్‌కు 333 ఓట్లు పోలయ్యాయి.

నూతన కార్యవర్గం: ఏఎంసీ నూతన అధ్యక్షుడిగా బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శిగా జె.వి.ప్రభాకర్, కోశాధికారిగా గార సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా మద్ది అప్పలకొండ, అలమండ ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా బి.గౌతంబాబు, పతివాడ రాంబాబు, మరో 8 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

అయ్యరక ఉగాది పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో అయ్యరక సంఘం ప్రతినిధులు

సీతంపేట: అఖిల భారత అయ్యరక సంక్షేమ సంఘం ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో జాతీయ ఉగాది పురస్కారాలు–2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో 25 మంది 3 నుంచి 64 తరాల వరకు గల సకుటుంబ వంశ వృక్షాలను సమర్పించి అయ్యరక జాతి ఉగాది పురస్కారాలను అందుకున్నారు. ఉత్తమ విద్యార్థులకు కూడా ఈ సందర్భంగా సత్కరించారు. ఈ వేడుకలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పెదిరెడ్ల రాజశేఖర్, ప్రతినిధులు శంకరరావు, దన్నిన సత్యనారాయణ, కర్రి రాంగోపాల్, ఎల్.వి.రావు, రాష్ట్ర సంఘం ప్రతినిధులు లంక రామన్న పాత్రుడు, పెదిరెడ్ల అప్పలరాజు, మలినా సూర్యప్రకాష్ పాల్గొన్నారు. అయ్యకర కులాన్ని బీసీ డీ నుంచి బీసీ ఏ కు మార్పుచేసేందుకు కృషి చేస్తామని సంఘ పెద్దలు తెలిపారు.

ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి

సీతంపేట: ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి కల్పించడానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తపిస్తున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సీతంపేటలోని జనసేన కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దీపం 2 పథకం ద్వారా ఇప్పటి వరకు 99 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్ అందించామన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ శ్రేణులతో, జీవీఎంసీ కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, రాష్ట్ర చైర్మన్లు, రీజనల్ కో ఆర్డినేటర్లు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

రాళ్ల పోలమ్మ ఆలయ నిర్మాణానికి శ్రీకారం



ఆరుబయట రాళ్ల మధ్య పోలమ్మ(ఫైల్)



తాత్కాలికంగా అమ్మవారికి గద్దె, గొడుగు ఏర్పాటు



ఆలయ నిర్మాణానికి చదును చేసిన స్థలం

తగరపువలస: ఆనందపురం మండలం పాలవలస పంచాయతీలోని దుక్కవానిపాలెం టోల్‌ప్లాజా సమీపంలో ఏళ్ల తరబడి రాళ్ల మధ్య కొలువై ఉన్న రాళ్ల పోలమ్మకు వసతులు కల్పించేందుకు పెద్దలు నిర్ణయించారు. రెండు రాళ్ల గుట్టల నడుమ ఉన్న అమ్మవారికి భక్తులు ఇప్పటివరకు బహిరంగ ప్రదేశంలోనే మొక్కులు చెల్లించుకుంటున్నారు. తలనీలాలు సమర్పించడం, భోజనాలు ఏర్పాటు చేసుకోవడం వంటివి చెట్ల కిందే జరుగుతున్నాయి. చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు సైతం పోలమ్మకు రాళ్లను నైవేద్యంగా సమర్పించడంతో ఈ ప్రాంతంలో పెద్ద గుట్టలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం పంచాయతీ పెద్దలు అమ్మవారి కోసం ఒక ఆలయాన్ని నిర్మించడానికి పూనుకున్నారు. ఇందులో భాగంగా చెట్లను తొలగించి, అమ్మవారి విగ్రహాన్ని తాత్కాలికంగా ఒక వేదికపై(గద్దె) ప్రతిష్ఠించారు. దానిపై గొడుగు ఏర్పాటు చేశారు. రాళ్ల గుట్టను మెట్టవాలుకు తరలించి.. ఆలయ నిర్మాణానికి మార్కింగ్ చేశారు.